GHMC hmda Growing Global TS-bPASS
MAKAM GANGADHAR NETHA
President (GHMC)
Telangana Building Planners Association
E-mail ID: sriswamiplanners@gmail.com
SRI SWAMI ASSOCIATES
ARCHITECTS•ENGINEERS•SURVEYORS
We Undertake Building Plans, Lay-Out Plans & Permissions, LRS, BRS, Tax Assesments
వాస్తుకి బిల్డింగ్ ప్లానింగ్, నక్ష చేయబడును
డిజిటల్ లాండ్స్ సర్వే, లే-అవుట్లు,
నక్ష ప్లానింగ్ చేయబడును,
Auto DCR Online Up Loading, Pre DCR Cad Drawing
భవన నిర్మాణం దరఖాస్తు కొరకు సంప్రదించండి.
GHMC, HMDA, DTCP, TS-bpass - Layout`s, Building Permissions
H.No. 11-5-565, Bhagya Laxmi Towers, Opp: GHMC Circle Office, Saroornagar, Hyderabad - 500035
Mob : 9393929595

HAPPY Independence DAY
క్రైమ్ THE మిర్రర్ ®
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
బుధవారం 15-10-2025 పబ్లిషింగ్ సెంటర్ : హైదరాబాద్



# కాటేదాన్ ఇండస్ట్రియల్ ఏరియాలో మౌలిక సదుపాయాలు కరువు

- సమస్యలు పరిష్కరించడంలో అధికారులు, సిబ్బంది విఫలం
- పన్నులు కడుతున్నా సమస్యల ఊబిలో చిక్కుకుపోయి ఉన్నామని వ్యాపారుల ఆగ్రహం

## బ్యాడ్మింటన్ పోటీల్లో ద గోల్డ్ మెడల్ సాధించిన జి.రామ్మోహన్‌రావుకు సత్కారం

**గండిపేట(క్రైం మిర్రర్):** మణికొండ బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షులు జి.రామ్మోహన్‌రావు దేశవిదేశాలలో వివిధ రకాల ఆటలు ఆడి గోల్డ్ మెడల్స్ సాధించి సందర్భంగా మంగళవారం అభినందించి సన్మానించారు. ఈ నెల 8వ తేదీ నుంచి 12వ తేదీ వరకు గుజరాత్ రాష్ట్రంలోని సూరత్ నగరంలో 4వ నేషనల్ వెటరన్స్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ ఛాంపియన్‌షిప్ సూర్%-%2025 పేరిట జాతీయ స్థాయి మాస్టర్స్ వెటర్న్ స్పోర్ట్స్ మేట్‌లో వివిధ రాష్ట్రాల నుంచి 600 మందికి పైగా అథ్లెటిక్స్‌లలో పాల్గొన్న అథ్లెటిక్స్, వాకింగ్ ట్యాక్(అన్ని రకాల కిలోమీటర్ల) వివిధ రకాలలో జరిగిన దరిమిల్లా అట్టి మాస్టర్ అథ్లెటిక్స్ పోటీలలో రామ్మోహన్‌రావు 11.5 మీటర్స్ షాట్‌పుట్ త్రోలో పాల్గొని రెండవ స్థానాన్ని కైవం చేసుకున్న వెండి పథకం సాధించారు. వారిని సముచితంగా సన్మానించి అభినందించారు.

- సైబర్ నేరాలపై సంగారెడ్డి జిల్లా పోలీసుల ప్రత్యేక నిఘా!
- పరిచయం ఏర్పరుచుకొని, బాధితుని నుండి భారీగా డబ్బులు వసూలు
- నిందితుడిని అదుపులోకి తీసుకున్న సంగారెడ్డి జిల్లా పోలీసులు
- స్వాధీనం చేసుకున్నవి: 3,63,000 మరియు ఒక సెల్ ఫోన్
- నిందితుడిని జుడీషియల్ రిమాండ్‌కు తరలింపు
- వివరాలు వెల్లడించిన జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్

# 10.33 లక్షలు పోగొట్టుకున్న ఇంజనీరింగ్ విద్యార్థి

2లో



హత్నూర, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి అక్టోబర్ 14: హత్నూర మండలానికి చెందిన ఒక ఇంజనీరింగ్ విద్యార్థి "డక్ చాట్ క్లబ్ యాప్" అనే మొబైల్ అప్లికేషన్ ద్వారా 10,33,000 పోగొట్టుకున్నట్లు జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ విలేకరులతో తెలిపారు. సైబర్ నేరగాడు ఒక అమ్మాయిగా నకిలీ ప్రొఫైల్‌తో పరిచయం చేసుకున్నాడు. ప్రేమ పేరుతో మోసం చేస్తూ, బెదిరింపులకు గురిచేస్తూ బాధితుని వద్ద నుండి డబ్బులు వసూలు చేశాడు.

# కాటేదాన్ ఇండస్ట్రియల్ ఏరియాలో మౌలిక సదుపాయాలు కరువు



**గండిపేట(క్రైం మిర్రర్):** ఆ ప్రాంతాల్లో దారులన్ని గోతులమయం... అంధకారం... పొంగిపోర్లుతున్న డ్రైనేజీలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రోడ్లు, డ్రైనేజీలు, స్ట్రీట్ లైట్లు, మంచినీటి సమస్యలతో వ్యాపారులు అవస్తలు పడుతున్నా వారి గోసను పట్టించుకునే నాధుడే కరువైయ్యారు. ప్రతి సంవత్సరం పన్నులను కడుతున్నా సమస్యల ఊబిలో చికుక్కపోయి ఉన్నామని వ్యాపారుల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని మైలర్ దేవ్ పల్లి డివిజన్ లోని కాటేదాన్ ఇండస్ట్రియల్ ఏరియాలో మౌలిక సదుపాయాలైన రోడ్డు, డ్రైనేజీ, స్ట్రీట్ లైట్స్, మంచి నీటి సమస్యలతో వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాటేదాన్ ఎస్బీఐ బ్యాంకు ఎదురుగా ఉన్న వీధిలో కనీసం రోడ్డు కూడా లేకపోవడం వలన, రాత్రి సమయాలలో రవాణాకు, భద్రతకు తీవ్ర సమస్యలు ఎదురవుతున్నాయని కంపెనీ యజమానులు బి. లింగారెడ్డి, జానీ బాయ్ తెలిపారు. వారు మాట్లాడుతూ, “రాజేంద్రనగర్ మున్సిపాలిటీ నుండి జీహెచ్ఎంసీ పరిధిలోకి మారినప్పటి నుంచి అనేక సంవత్సరాలు గడిచినా, ఇండస్ట్రియల్ ఏరియాలో కనీస మౌలిక సదుపాయాలు కూడా ఏర్పాటు కాలేదు. వ్యాపారులు, పరిశ్రమల యజమానులు పన్నులను సమయానికి చెల్లిస్తున్నప్పటికీ, ఇక్కడ ఎటువంటి అభివృద్ధి జరగడం లేదు,” అని ఆవేదన వ్యక్తం చేశారు. పరిశ్రమల అవసరాలు, భద్రత దృష్ట్యా, అధికారులు వెంటనే స్పందించి కాటేదాన్ ఇండస్ట్రియల్ ఏరియాలో రోడ్లు, డ్రైనేజీ, వీధి దీపాలు, మంచి నీటి సమస్యలను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని కంపెనీ యజమానులు సంబంధిత ఉన్నతాధికారులను కోరారు.

## శ్రీ రాంసాగర్ 2దశ కాల్వ కు భీమ్ రెడ్డి నరసింహ రెడ్డి పేరు పెట్టాలి

**నూతనకల్ ( క్రైమ్ మిర్రర్):** శ్రీరామ్ సాగర్ రెండో దశ నిర్మాణం చేపట్టి తుంగతుర్తి సూర్యాపేట ప్రాంతాలకు నీరు అందిస్తే ఈ ప్రాంతం సస్యశ్యామలమై రైతులు సంతోషంతో వ్యవసాయాన్ని కొనసాగిస్తారని స్వర్గీయ భీమిరెడ్డి నరసింహారెడ్డి తాను ఎంపీగా ఉన్న సందర్భంలో అనేకసార్లు పార్లమెంటులో తన వాయిస్ ని వినిపించిన బీఎన్ నర్సింహా రెడ్డి పేరు పెట్టాలని సిపిఎం పార్టీ జిల్లా సభ్యులు కందాల శంకర్ రెడ్డి అన్నారు. శ్రీరామ్ సాగర్ ఫేస్ 2కు ఆర్డీఆర్ పేరు పెట్టడం పట్ల మంగళవారం మండల కేంద్రంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో అనేకసార్లు శ్రీరాంసాగర్ రెండవ దశ నిర్మాణాన్ని పూర్తి చేయాలని రాష్ట్రవ్యాప్తంగా ధర్నాలు నిర్వహించామని. శ్రీరామ్ సాగర్ రెండో దశ నిర్మాణం కోసం కృషి చేసిన భీమిరెడ్డి నరసింహారెడ్డి మల్లు స్వరాజ్యంల నామకరణం చేయాలని గతంలోనే కమ్యూనిస్టు పార్టీలు ప్రభుత్వాలను డిమాండ్ చేయడం జరిగింది గుర్తు చేశారు. మాజీ మంత్రి రామ్ రెడ్డి దామోదర్ రెడ్డి సంతాప సభకు విచ్చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీకి చెందిన రాష్ట్ర మంత్రి దామోదర్ రెడ్డి పేరు పెట్టాలనడం దురదృష్టకరమని విమర్శించారు. సిపిఎం పార్టీకి తుంగతుర్తి ప్రాంతంలో ఉన్న వామపక్షాలకు మాజీ మంత్రి దామోదర్ రెడ్డి మీద కానీ వారి కుటుంబ పై గానీ ఎలాంటి వ్యతిరేకత లేకున్నా ఈరోజు వారి కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ రాజకీయాల్లో ఎలాంటి గౌరవం ఇచ్చిన సిపిఎం పార్టీ వ్యతిరేకించదని కానీ గోదావరి జలాలను ఎస్సారెస్పీ రెండవ దశ పూర్తి చేస్తే ఈ రైతాంగం పంటలను పండించుకుని సంతృప్తిగా ఉంటారని వామపక్షాల డిమాండ్ల చేత గత ప్రభుత్వాలు తెలుగుదేశం పార్టీలో గాని కాంగ్రెస్ పార్టీలో గాని ఈ కాలువను నిర్మించి ఇక్కడ రైతాంగానికి నీరు అందించడం జరుగుతుందని తెలిపారు. వామపక్షాలు ఆనాడు ఉన్న సిపిఎం పార్టీ అగ్ర నాయకులు ఈ ప్రాంత వాసులు భీమిరెడ్డి నరసింహారెడ్డి మల్లు వెంకట్ నరసింహ రెడ్డి మల్లు స్వరాజ్యం సారంపల్లి మల్లారెడ్డి ఇలాంటి మహనీయులు రైతుల కోసం ఎన్నో అవమానాలను ఎదుర్కొని ఈ ప్రాంత ప్రజల కోసం ధర్నాలు చేసి ప్రభుత్వం లేని కారణంగా అనేక ఇబ్బందులు ఎదుర్కొని వాళ్ళ ధ్యేయం ఈ రెండు ఎస్సారెస్పీ కాలువ నిర్మాణం పూర్తి చేయాలని ఉన్నందున ఎస్సారెస్పీ ఫేస్ 2 ను ఆర్డిఆర్ గా నామకరణ చేయడం సమంజసం కాదని ఆయన అన్నారు .ఇప్పటికైనా ప్రభుత్వం మహనీయుల త్యాగాలను అవమానపరచకూడదని వారు అన్నారు. దామోదర్ రెడ్డి సేవలకు గుర్తింపుగా రుద్రమ చెరువును రిజర్వాయర్ చేసి దాని పేరు ఆర్డిఆర్ గా పెడితే మేము సంతోష పడతామని వామపక్షాలుగా అభ్యంతరం లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో గజ్జల శ్రీనివాస్ రెడ్డి జటంగి లింగయ్య కూసు వెంకన్న పులుసు జనార్దన్ మున్నా లింగయ్య కూసు రామచంద్రు బొజ్జ మల్లయ్య సామ వెంకట్ రెడ్డి తోట్ల శేఖర్ తోట్ల హరీష్ బాణాల విజయ్ కృష్ణ రెడ్డి జటంగి మహేష్ పాల్గొన్నారు.




## తప్పిపోయిన మహిళ మృతదేహం లభ్యం



**బాలాపూర్ (క్రైమ్ మిర్రర్):** 52 సంవత్సరాల మహిళ మృతదేహం మీర్పేట్ లోని మంత్రాల చెరువులో లభ్యమయింది. మీర్పేట్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ శంకర్ కుమార్ నాయక్ తెలిపిన వివరాల ప్రకారం మీసాల కమల అలియాస్ యాదమ్మ వయస్సు 52, బడంగ్పేట్ లోని సమత నగర్ లో నివసించే యాదమ్మ ఈనెల 12న ఇంటి నుండి బయటకు వెళ్లి తిరిగి రాలేదని మంగళవారం నాడు మీర్పేట్ లోని మంత్రాల చెరువులో మృతదేహంగ లభ్యమైనట్లు పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా హాస్పిటల్ తరలించి పోస్టుమార్టం తర్వాత కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించారు.

తోపుడు బండ్లు,

## డబ్బాకొట్ల వర్కర్స్ సమస్యలు పరిష్కరించాలి.

### సిఐటీయు జిల్లా అధ్యక్షుడు సిహెచ్ లక్ష్మీనారాయణ

**చండూరు, క్రైమ్ మిర్రర్:** చండూరు మండల కేంద్రంలోని తోపుడు బండ్లు డబ్బాకొట్లను తొలగించాలని ఇచ్చిన నోటీసు ఉపసమరించుకోవాలని అదేవిధంగా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని, సిఐటియు జిల్లా అధ్యక్షుడు సిహెచ్ లక్ష్మీనారాయణ కోరారు. మంగళవారం కార్మికుల సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని మున్సిపల్ కమిషనర్ మల్లేశంకు అందజేశారు. చండూర్ మున్సిపల్ కేంద్రంలో గత 30 సంవత్సరాలుగా తోపుడుబండ్లు డబ్బా కొట్లు పెట్టుకొని సుమారు 100 మంది కార్మిక కుటుంబాలు జీవనం కొనసాగిస్తున్నారని అన్నారు. రోడ్డు నిర్మాణం పేరుతో మున్సిపల్ అధికారులు కార్మికులకు నోటీసులు ఇచ్చి వెళ్లిపోవాలని అనడం అన్యాయమని అన్నారు. కుటుంబాలకు ఫుట్పాత్ వ్యాపారమే జీవనాధారం అని అలాంటి వారి పొట్ట మీద కొట్టకుండా ఇచ్చిన నోటీసును ఉపసంహరించుకోవాలని కోరారు. రోడ్డు నిర్మాణానికి ఆటంకం లేకుండా తమ వ్యాపారాలు చేసుకోవడానికి అవకాశం ఉన్నదని అన్నారు. జిల్లాలో అన్ని మున్సిపాలిటీలలో లాగే మా వ్యాపారాలు కూడా కొనసాగించాలని ఆయన మున్సిపల్ కమిషనర్ ని కోరారు. కార్మికులకు గుర్తింపు కార్డులు, ఇన్సూరెన్స్, చిరు వ్యాపారులకు ఇచ్చే రుణాలు ఇప్పిచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రం తీసుకున్న కమిషనర్ స్పందిస్తూ ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా మీ వ్యాపారాలు మీరు చేసుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ జేరిపోతుల ధనంజయ్, సీనియర్ నాయకులు మోగదాల వెంకటేశం,తోపుడు బండ్లు మరియు డబ్బా కోట్ల వర్కర్స్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు ఇరిగి యాదయ్య,గంట యాదగిరి, దేవయ్య, వాజిద్, నరసింహ, జక్కలి నాగరాజు, వాణి, మండలి వెంకటేశం, జహంగీర్, అంజమ్మ, పూలమ్మ తదితరులు పాల్గొన్నారు.



# యాదగిరిగుట్టలో కార్తీక మహోత్సవాలకు భారీ ఏర్పాట్లు

**దేవాలయ ఏర్పాట్లను పరిశీలించిన ఈవో.జి. రవి**

**యాదగిరిగుట్ట, అక్టోబర్ 14(క్రైమ్ మిర్రర్) :** యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామివారి దేవస్థానంలో ఈ నెల 22వ తేదీ నుంచి నవంబర్ 20వ తేదీ వరకు కార్తీక మాహోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాటు చేస్తున్నట్లు ఆలయ ఈఓ. జి.రవి తెలిపారు. మంగళవారం యాదగిరిగుట్ట దేవస్థానంతో పాటు కొండ కింద వ్రత మండపాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్తీకమాసంలో అధిక సంఖ్యలో భక్తులు రానున్న నేపథ్యంలో ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని విధాలుగా ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకు రావాలని ఇంజినీరింగ్, శానిటేషన్, వ్రత మండపం, రిసెప్షన్, గోదాం, పరిపాలన, భద్రతా సిబ్బంది, పాతగుట్ట, ప్రసాద విక్రయం, ప్రచార శాఖ, లీజెస్, ఆన్లైన్ విభాగాలకు ఆయన పలు సూచనలు చేశారు. సత్యనారాయణ స్వామి వ్రత మండపంలోని హాల్ 1, 2 లలో రోటేషన్ పద్ధతిన 6 బ్యాచ్ లుగా సత్యనారాయణస్వామి వ్రతాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మొదటి బ్యాచ్ ఉదయం 7 గంటలకు ప్రారంభమై చివరి 6వ బ్యాచ్ సాయంత్రం 6 గంటలకు ముగుస్తుందన్నారు. నవంబర్ 5వ తేదీన కార్తీక పౌర్ణమి సందర్భంగా 8 బ్యాచ్ లుగా వ్రతాలు జరుగనున్నట్లు చెప్పారు. ఉదయం 5 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు వ్రతాలు కొనసాగుతాయన్నారు. పాతగుట్ట ఆలయంలో నాలుగు బ్యాచ్ లు, కార్తీకపౌర్ణమి రోజున 6 బ్యాచ్ లు వ్రతాలు నిర్వహిస్తామన్నారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా నవంబర్ 5వ తేదీన ప్రధానాలయంతో పాటు అనుబంధ పర్వత వర్ధినీ సమేత రామలింగేశ్వర స్వామివారి ఆలయంలో ఆకాశ దీపారాధన కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు వెల్లడించారు... కార్తీకమాసాంతం వరకు ప్రతి శని, ఆదివారాలలో వెయ్యి మందికి ఉచిత అన్నప్రసాదం ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

# జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ గెలవడం ఖాయం...

**ఖమ్మం నియోజకవర్గం ముఖ్య నాయకుల సమావేశంలో మాజీ మంత్రి పువ్వాడ...**

**ఖమ్మం (క్రైమ్ మిర్రర్ ప్రతినిధి):** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలు సందర్భంగా ఖమ్మం నియోజకవర్గ ముఖ్య నాయకుల సమావేశంలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ గారు మాట్లాడుతూ నవంబర్ 11న జరిగే జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రచార కార్యక్రమంలో ఖమ్మం నియోజకవర్గ నాయకులు పాల్గొని బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి మాగంటి సునీత గారి గెలుపు కొరకు కృషి చేయాలని కోరారు. దివంగత నేత మాగంటి గోపినాథ్ గారు జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో మూడు సార్లు ఎమ్మెల్యే గా గెలిచిన వ్యక్తి..నాకు అయనతో వ్యక్తిగత సంబంధం ఉంది ఆయన మరణం తీరని లోటు. ఖమ్మం కార్పొరేషన్ ఎన్నికల సమయంలో కరోనా వచ్చి అందరు బయపడుతుంటే గోపినాథ్ గారు అయన కార్యకర్తలతో ఖమ్మం వచ్చి కార్పొరేషన్ ఎన్నికల్లో పనిచేసి గెలుపు కొరకు ప్రధాన పాత్ర పోషించారని అన్నారు.. ఈ ఉప ఎన్నికల్లో మనం కూడా కష్టపడి పనిచేసి మాగంటి గోపినాథ్ గారి సతీమణి సునీత గారిని గెలిపించి రుణం తీర్చుకోవాలని అన్నారు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వం మీద ప్రజలు విసుగుచెంది మరలా కేసీఆర్ గారు ముఖ్యమంత్రిగా రావాలని కోరుకుంటున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి ఇచ్చిన దొంగ హామీలు రైతు రుణమాఫీ,రైతు భరోసా,రైతు బందు,నిరుద్యోగ భృతి,4వేల పెన్షన్,ప్రతి మహిళకు 2500,ఆడపిల్లలకు స్కూటీలు,కల్యాణలక్ష్మితులం బంగారం ఇవ్వకుండా ప్రజలను మభ్యపెడుతుందని ఈ విషయాలన్నిటిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షులు పగడాల నాగరాజు,మాజీ డిసిసిబి చైర్మన్ కూరాకుల నాగభూషణం, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ అర్జీసీ కృష్ణ,టేకులపల్లి సొసైటీ చైర్మన్ బీరెడ్డి నాగచంద్ర రెడ్డి,మాజీ జిల్లా గ్రంధాలయం చైర్మన్ ఖమర్,మాజీ సుడా చైర్మన్ బచ్చు విజయ్ కుమార్,ఫ్లోర్ లీడర్ కర్నాటి కృష్ణ,డిప్యూటీ ఫ్లోర్ లీడర్ మక్బుల్,జిల్లా మైనారిటీ అధ్యక్షులు తాజుద్దీన్,మండల అధ్యక్షులు వీరు నాయక్,మాజీ డిప్యూటీ మేయర్ బత్తుల మురళి,కార్పొరేటర్లు చిరుమామిళ్ల లక్ష్మి నాగేశ్వరరావు,కూరాకుల వలరాజు,బుడిగం శ్రీను,పసుమర్తి రామ్మోహన్,జ్యోతి రెడ్డి,రుద్రగాని శ్రీదేవి ఉపేందర్,ముక్కాల రాజేష్, దనాల శ్రీకాంత్,%జఔజ% చైర్మన్ భారతి రాణి,కొల్లు పద్మ,షకీనా,శంసుద్దీన్, పల్లా రాజశేఖర్ మాజీ సర్పంచ్ హరిప్రసాద్,మెంటం రామారావు,చెరుకూరి ప్రదీప్, లక్ష్మణ్ నాయక్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



# సబ్సిడీపై రైతులకు వేరుశెనగ విత్తనాలు పంపిణీ

**మునుగోడు క్రైమ్ మిర్రర్ :** రైతులు వేరుశెనగ సాగు చేయాలి అని జిల్లా వ్యవసాయాధికారి పాల్వాయి శ్రవణ్ కుమార్ అన్నారు. మండలములోని పులిపలుపుల రైతు వేదికలో ఆహార నూనెలకు జాతీయ యంత్రాంగం పథకంలో భాగంగా 100% సబ్సిడీపై వేరుశెనగ విత్తనాలను జిల్లా వ్యవసాయ అధికారి పాల్వాయి శ్రవణ్ కుమార్ చేతుల మీదుగా రైతులకు అందజేశారు. ప్రభుత్వము అందిస్తున్న వేరుశనగ విత్తనాలను రైతులు తప్పనిసరిగా సాగు చేయాలని తెలియజేశారు. కపాస్ కిసాన్ యాప్ ను పత్తి పంట పండించే ప్రతి రైతు ఇన్స్టాల్ చేసుకోవాలని ,పత్తి అమ్ముకోవడానికి ఈ యాప్ ద్వారా స్లాట్ బుక్ చేసుకొని మనకు దగ్గరలో ఉన్న పత్తి మిల్లుల్లో అమ్ముకోవచ్చు అన్నారు. స్లాట్ బుక్ తనిఖీ చేసుకొని పత్తి తీసుకు పోవాలి. అదేవిధంగా కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా నాణ్యతా ప్రమాణాలను పాటించినట్లయితే పత్తి కి మంచి మద్దతు ధర పొందవచ్చు 8%తేమ ఉంటే 8110 రూ, ఒక క్వింటాలుకు 9% ఉంటే 8028 రూ ,10% ఉంటే 7947 రూ ,11% ఉంటే 7866 రూ ,12% ఉంటే 7785 రూ ఒక క్వింటాలకు పొందవచ్చు అని తెలిపారు.. ఈ కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు బి వేణుగోపాల్, వ్యవసాయ అధికారి పద్మజ , మల్లేష్ , వ్యవసాయ విస్తరణ అధికారులు మాధగాని నరసింహ గౌడ్, వహీద్, యాదగిరి, నిఖిల్, వెంకటేష్ చండూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కుంభం చెన్నారెడ్డి రైతులు పాల్గొన్నారు.





# కల్లుగీత కార్మిక సంఘం మండల మహాసభను జయప్రదం చేయండి

**క్రైమ్ మిర్రర్ వలిగొండ:** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల కేంద్రంలో అక్టోబర్ 18 వ తేదీన జరిగే కల్లు గీత కార్మిక సంఘం మండల మహాసభను జయప్రదం చేయాలని మంగళవారం మండలంలోని అన్ని గ్రామాల కల్లుగీత కార్మికులను కలిసి కరపత్రాలు ఆవిష్కరించడం జరిగింది. ఈ యొక్క కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర కల్లుగీత కార్మిక సంఘం నాయకులు మద్దెల రాజయ్య, గాజుల ఆంజనేయులు కోరారు. ఈ కార్యక్రమంలో మండల కల్లు గీత కార్మిక సంఘం అధ్యక్షులు పబ్బతి మల్లేశం కోశాధికారి పల్సం స్వామి,నాయకులు కొండూరుసత్తయ్య, గ్రామాలలోని సొసైటీ అధ్యక్షులు కల్లుగీత కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## కే హెచ్ పి ఎస్ ప్రథమ మహాసభ పోస్టర్ ఆవిష్కరణ




**క్రైమ్ మిర్రర్ వలిగొండ:** యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి పట్టణ కేంద్రంలో సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో అక్టోబర్ 17 న జరుగు కార్మిక హక్కుల పోరాట సంఘం కే హెచ్ పి ఎస్ తెలంగాణ రాష్ట్ర ప్రథమ మహాసభ హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరుగు పోస్టర్ ను ఆసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లెం ప్రసాద్ తో పాటు నాయకులు మంగళవారం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద ఆవిష్కరించారు. ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పూల మాలవేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా కల్లెం ప్రసాద్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 44 కార్మిక చట్టలను రద్దుచేసి నాలుగు లేబర్ లు తీసుకురావడం వల్ల దేశ వ్యాప్తంగా 44 కోట్లమంది సంఘటిత, అసంఘటిత రంగాల కార్మికుల జీవితాలు ప్రమాదంలో పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. మనుస్మృతి పోలిన మోదీ కొత్త కోడ్ ల వల్ల కార్మికులు బిచ్చగాళ్లుగా మారుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమ కారుల జె ఏ సి రాష్ట్ర నాయకులు సంగిశెట్టి క్రిష్టఫర్,ఎర్ర జాన్సన్,బాకారం లవణ్య,ఒగ్గిరాల సుజ్జి, కొండపురం శ్రీనివాస్, వలమల్ల పెంటయ్య పాల్గొన్నారు.

## ఆర్థిక సహాయం అందజేత.



కేశంపేట (క్రైమ్ మిర్రర్): మండల పరిధిలోని లేమామిడి గ్రామానికి చెందిన సంపంగి ఆంజనేయులు గత వారం క్రిందట రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. ఈ ప్రమాదంలో ఆంజనేయులుకి కాలు విరిగింది. వారిది నిరుపేద కుటుంబం కావడంతో విషయం తెలుసుకున్న గ్రామస్తులు గోగు జగత్ రెడ్డి పదివేల రూపాయలు, కొకుంట్ల వెంకటేశ్వర రెడ్డి(బబ్లు) ఐదు వేల రూపాయలను మంగళవారం ఆర్థిక సహాయంగా అందజేశారు. అతనికి మనోధైర్యాన్ని కల్పించి తొందరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

# మృతుల కుటుంబాలకు అండగా రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ ఆర్థిక సాయం

**క్రైమ్ మిర్రర్, కల్వకుర్తి(కడ్తాల్):** కడ్తాల్ మండలంలోని ఇటీవల మృతి చెందిన మృతుల కుటుంబాలకు రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ రూ.10వేలు ఆర్థిక సహాయాన్ని అందించారు. కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ చేతుల మీదిగా ట్రస్ట్ చైర్మన్, మాజీ జెడ్పిటిసి లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు జర్పుల దశరథ్ నాయక్ అందించారు. గానుగమర్ల తండ గ్రామపంచాయతీ కి చెందిన నేనవత్ సోమ్లా గుండెపోటుతో మంగళవారం ఉదయం మృతి చెందారు. విషయం తెలుసుకున్న దశరథ్ నాయక్ ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి తాన ట్రస్ట్ ద్వారా రూ. 5 వేలు అందజేశారు. అదేవిధంగా సోమవారం సాయంత్రం కడ్తాల్ గ్రామానికి చెందిన జల్కం శేఖర్ రోడ్డు ప్రమాదంలో మరణించారు. వారి కుటుంబానికి పరామర్శించి ట్రస్టు ద్వారా రూ.5 వేలు ఆర్థిక సాయం అందించారు. ముదివెన్ గ్రామానికి చెందిన మాజీ సింగిల్ విండో డైరెక్టర్ కాశీనాథ్ రెడ్డి మృతదేహానికి పూలమాలవేసి వారి కుటుంబానికి పరామర్శించారు. మాజీ సర్పంచులు లక్ష్మీ నరసింహారెడ్డి హరిచంద్ నాయక్ డైరెక్టర్ జోగు వీరయ్య సేవ్య నాయక్ వెంకటయ్య నాయకులు శ్రీను నాయక్ పొట్టి శీను వినోద్ గోపాల్ హెచ్ఆర్ మహేష్ శంకరయ్య సత్రు సిహెచ్ మహేష్ శ్రీకాంత్ చందర్ శంకర్ నాయక్ వెంకటేష్ ముత్యాలు బిక్షపతి సురేష్ రమేష్ నాయకులు తదితరులు పాల్గొన్నారు

# బీసీల హక్కులు రాజకీయ లెక్కలకు బలి!

**మన ఆలోచన సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి- గోదా మల్లికార్జున్ గౌడ్**

**హైదరాబాద్, అక్టోబర్ 14(క్రైమ్ మిర్రర్):** ప్రజాస్వామ్యం అంటే అందరికి సమాన హక్కులు కానీ, అది లెక్కల ఆటగా మారిందా? తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల వేళ, బీసీ రిజర్వేషన్ అంశం మళ్లీ చర్చలకు కేంద్రంగా మారింది. స్థానిక సంస్థల్లో బిసి లకు 42% రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవో నెంబర్ 9 పై హైకోర్టు తాత్కాలికంగా ఇచ్చిన స్టే, రాష్ట్ర రాజకీయలను కుదిపేస్తోంది. కానీ అసలు ప్రశ్న ఇది కేవలం చట్టపరమైన సమస్యనా? లేదా రాజకీయ లెక్కల కారణంగా ప్రజాస్వామ్యానికి పడిన దెబ్బనా అనేది తేలాల్సివుంది

**హక్కుల కోసం చట్టంపై పోరాటం**

బీసీలు రాష్ట్ర జనాభాలో సగానికి పైగా ఉన్నా, అధికార వ్యవస్థల్లో వారి వాటా తక్కువ. గ్రామ పంచాయతీలు, మండల పరిషత్తులు, జిల్లా పరిషత్తుల్లో బీసీల ప్రాతినిధ్యం తగ్గిపోవడం కేవలం సీట్లు తగ్గడమే కాదు, సామాజిక న్యాయంలో కూడా వెనుకబాటుకు గురి అవుతుంది. ప్రతీ ఎన్నికల్లో "బీసీలకు న్యాయం చేస్తాం" అని చెప్పే రాజకీయ నేతలు, పార్టీలు ఎన్నికల తర్వాత మౌనం పాటించడం సర్వసాధారణంగా మారింది. బిసి లను కేవలం ఓటు బ్యాంకుగా చూడడం అనేది పరిపాటిగా మారింది ఇదే నిర్లక్ష్యం హైకోర్టు తీర్పుకి దారి తీసింది.

**చట్టం కాదు చిత్తశుద్ధి లోపం ప్రధాన కారణం**

ప్రభుత్వం హైకోర్టు స్టేను చట్టపరమైన అడ్డంకిగా చూపుతుంటే, ప్రతిపక్షాలు "ప్రభుత్వ నిర్లక్ష్యం ఫలితం" అని వాదిస్తున్నాయి. వాస్తవానికి సమస్య చట్టంలో కాదు, దాని అమలులో పారదర్శకత లేకపోవడంలో ఉంది.

బీసీ జనాభా లెక్కలు స్పష్టంగా లేకపోవడం

వర్గీకరణ పూర్తికాకపోవడం

సుప్రీంకోర్టు విధించిన 50% రిజర్వేషన్ పరిమితి ఉల్లంఘన జరగడం లాంటి ఈ లోపాలే హైకోర్టు స్టేకు కారణమయ్యాయి.

**రిజర్వేషన్ %-% ఓటు బ్యాంక్ కోసం కాదు, సమానత్వం కోసం**

రిజర్వేషన్ రాజకీయ ప్రయోజనం కోసం కాదు, సామాజిక న్యాయం కోసం ఉద్దేశించిన విధానం. దశాబ్దాలుగా వెనుకబడిన వర్గాలకు సమాన అవకాశాలు కల్పించడం దాని సారాంశం. కానీ రాజకీయ వ్యవస్థ దాన్ని ఓటు లెక్కలుగా మార్చేసింది. ఎవరిగా సంతోషపరిచి గెలవాలి అనే లెక్కలే ప్రస్తుత రాజకీయాల్లో నడుస్తున్నాయి. ఇది కేవలం బీసీల సమస్య కాదు, ఇది ప్రజాస్వామ్య విలువల క్షీణతకు సంకేతం.

**హైకోర్టు తీర్పు -వాచ్చరిక మాత్రమే కాదు, గుణపాఠం**

హైకోర్టు ఇచ్చిన స్టే కేవలం చట్టపరమైన నిర్ణయం కాదు, ప్రజాస్వామ్య వ్యవస్థలకు ఇచ్చిన హెచ్చరిక."సమాజానికి సంబంధించిన నిర్ణయాలు సరైన డేటా, సాక్ష్యాలతో ఉండాలి" అని తీర్పు స్పష్టం చేసింది.బీసీ జనగణన లేకుండా రిజర్వేషన్‌కి న్యాయం జరగదు. రాష్ట్రం మాత్రమే కాదు, కేంద్రం కూడా ఓబీసీ జనగణనపై నిర్లక్ష్యం చూపకూడదు.

**ఇంకా ఎంతకాలం?**

స్థానిక సంస్థల ఎన్నికలు, ప్రజలు పాలనలో నేరుగా భాగస్వామ్యం అవడం కోసం జరగాల్సిన వేళ, వాయిదాలు పడటం గ్రామాల్లో అభివృద్ధికి అడ్డంకి. ఇది బీసీలకే కాదు, మొత్తం ప్రజాస్వామ్యానికి వెనుకడుగు. హక్కుల కోసం కోర్టు మెట్లు ఎక్కే పరిస్థితి రావడం మన వ్యవస్థ లోపాలను బహిర్గతం చేస్తోంది.

ప్రజాస్వామ్యం బలపడాలంటే హక్కులు ఇవ్వడం కాదు, అవి నిజంగా అమలవ్వాలి. హైకోర్టు స్టే తాత్కాలికమైనదే కానీ, మనకు శాశ్వత పాఠం చెబుతోంది: హక్కులు రాజకీయ లెక్కల క్షేత్రం కాకుండా, నిజమైన సామాజిక న్యాయానికి ఆధారంగా ఉండాలి.

బీసీలు%ా% ఆత్మగౌరవాన్ని నిలబెట్టుకోవాలి

బీసీ హక్కులు ఎవరి దయతో రావు. అవి చట్టపరమైన నిర్ణయాలు, ప్రజా చైతన్యం, రాజకీయ నిష్టతోనే సాధ్యమవుతాయి.

రాజకీయాలు ఓటు లెక్కల నుంచి బయటకు వచ్చి, సమానత్వం వైపు నడవాలి. బీసీలు తమ హక్కులను అడగడమే కాకుండా, "ఇది మా ప్రజాస్వామ్య హక్కు" అని ధైర్యంగా ప్రకటించగలగాలి.

ఎన్నికల్లో బీసీలు విచక్షణతో వ్యవహరించి తమ భవిష్యత్తుకే ఓటు వేస్తే, సమానత్వం, సమాన న్యాయం, సామాజిక అభివృద్ధి సాధ్యపడుతుంది.





## ప్రజలకు మెరుగైన భద్రతా రక్షణకై నాఖాబందీ

**నూతనకల్ ( క్రైమ్ మిర్రర్):** ప్రజలకు మెరుగైన రక్షణ కల్పించుటమే లక్ష్యంగా మంగళవారం మండల పరిధిలోని బిక్కుమల్ల జాతీయ రహదారిపై పోలీసులు నాఖాబందీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ నాగరాజు మాట్లాడుతూ జిల్లా ఎస్పీ నరసింహ ఆదేశాల మేరకు జిల్లాలోకి వచ్చి పోయే అన్ని మార్గాలను, సరిహద్దులను అష్టదిగ్బంధనం చేసినట్లు తెలిపారు. నాఖాభంది ద్వారా అక్రమ రవాణా, అనుమానితుల కదలికలు, రౌడీషీటర్ల్ కదలికలు, గంజాయిరవాణా చేసే వారి కదలికలు, అంతర్రాష్ట్ర అంతర్ జిల్లా నేరస్తుల కదలికలు గుర్తించి నివారించడం, నేరాలను అదుపు చేయడంలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించామని తెలిపారు.



## వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలి

**నూతనకల్ ( క్రైమ్ మిర్రర్):** మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్యాధికారి పి.చంద్రశేఖర్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఆరోగ్య కేంద్రంలో జరుగుతున్న కార్యక్రమాలపై రివ్యూ నిర్వహించి,పలు రికార్డ్స్ ను తనిఖీ చేశారు.సిబ్బంది అందరు సమయపాలన పాటించాలని ఆదేశించారు. ఈనాటి కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ లిఖిత్, సిహెచ్ఓ ఎల్.చరణ్, చిన్ని, ప్రియాంక,శిరీష,దీపిక, మనీషా,సుమంజలి . అనూహ్య ,ఉషారాణి, ఆనంద్ గౌడ్ పాల్గొన్నారు.

## శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో క్షేత్ర పాలకుడికి ఘన పూజలు

**యాదగిరిగుట్ట, అక్టోబర్ 14(క్రైమ్ మిర్రర్):** శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి సన్నిధిలో మంగళవారం రోజు క్షేత్ర పాలకుడైన శ్రీ ఆంజనేయ స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. విష్ణు పుష్కరిణి ఆవరణలో గల ఆంజనేయ స్వామికి అర్చక బృందం వారు మన్య సూక్త



పారాయణముతో అభిషేకం నిర్వహించారు. సింధూరంతో అలంకరించిన స్వామివారికి వివిధ రకాల సుగంధం వెదజల్లే ద్రవ్యాల పూలమాలలతో అలంకరించి నాగవల్లి దలార్చన నిర్వహించారు.ఈ ఆకు పూజ కార్యక్రమం లో భక్తులు, స్థానికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# ఓట్ల చోరీ ప్రజాస్వామ్యానికి ప్రమాదకరం

**కల్వకుర్తి నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు శాబుద్దీన్**

**క్రైమ్ మిర్రర్, కల్వకుర్తి(కడ్తాల్) :** ఓట్ల చోరీ ప్రజాస్వామ్యానికి చాలా ప్రమాదకరమని కల్వకుర్తి నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు శాబుద్దీన్ అన్నారు. ఓటు చోరీకి వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో ప్రతి గ్రామంలో 100 మందితో సంతకాల సేకరణ చేపట్టాలని ఏఐసీసీ ఆదేశించింది. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి ఆదేశాలతో కడ్తాల్ మండల్ మక్త మధారం గ్రామంలో మంగళవారం సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. దేశంలో బిజెపి పార్టీ పెద్ద ఎత్తున ఓటు చోరీ చేసి కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిందని శాబుద్దీన్ ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఆర్కోటం సురేష్, యట సురేష్, యట రమేష్, క్రాంతి, కరీం, సమీర్, అశ్విని, మంజుల, నవాజ్ తదితరులు పాల్గొన్నారు.

# జాన్ డియర్ ట్రాక్టర్ వినియోగం వల్ల రైతులకు అధిక లాభాలు

**-టెరిటరీ మేనేజర్ నటేష్**

**క్రైమ్ మిర్రర్ వలిగొండ:** వ్యవసాయంలో జాయర్ ట్రాక్టర్ వినియోగం వల్ల రైతులు అధిక లాభాలనుపొందవచ్చు అని జాన్ డియర్ ట్రాక్టర్ టెరిటరీ మేనేజర్ నటేష్ అన్నారు. ఈ సందర్భంగా వలిగొండ మండల పరిధిలోని పులిగిల్ల గ్రామంలో జాన్ డియర్ ట్రాక్టర్ గురించి అవగాహన సదస్సు కార్యక్రమం నిర్వహించారు. అందులో భాగంగా 5045 జి పి ట్రాక్టర్ లాంచింగ్ ప్రోగ్రాం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొట్టమొదటగా పవర్ స్టీరింగ్ ట్రాక్టర్ కేవలం జన్డియర్ తోనే మొదలైందని, అంతేకాకుండా రైతులకు అధునాతన సాంకేతికతతో మెరుగైన ఫలితాలను అందిస్తూ జన్డియర్ ట్రాక్టర్ అత్యద్భుత ఫలితాలను రైతులకు అందిస్తుందని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో టాక్టికల్ మేనేజర్ ఆయుషి, సేల్స్ ఆఫీసర్ అజయ్, డిమాన్స్టేటర్ శివాజీ, వివిసి ట్రాక్టర్స్ జనరల్ మేనేజర్ ప్రజాపతి, వలిగొండ బ్రాంచ్ మేనేజర్ పల్లెర్ల మహేష్, టెక్నీషియన్స్ సూపర్వైజర్స్ తదితరులు పాల్గొన్నారు.



# అబద్ధపు హామీలతో ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్

**నూతనకల్ ( క్రైమ్ మిర్రర్):** బీఆర్ఎస్ నాయకులు మంగళవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ ఇంటింటి బాకీ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు మున్నా మల్లయ్య యాదవ్ మాట్లాడుతూ.,,.. గత అసెంబ్లీ ఎన్నికల్లో అబద్ధపు హామీలను ఇచ్చి ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని రాబోవు స్థానిక ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ నాయకులను నిలదీసి అడిగే సమయం ఆసన్నమైందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ మాసాలను ఎండబెడుతూ వాడ వాడలా కాంగ్రెస్ ఇంటింటి బాకీ కార్డులను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బత్తుల సాయిల్ గౌడ్,చూడి లింగారెడ్డి, గాడుదుల లింగరాజు, జక్కి పరమేష్, కప్పల రామ్మూర్తి,వస్త్రం నాయక్,మొగుళ్ళ వెంకన్న, మధు హనుమంత్, రేసు వెంకటేశ్వర్లు,కనకటి, మహేష్, విద్యాసాగర్, బత్తుల విజయ్ కుమార్,నాగు నాయక్, వీరు యాదవ్, లింగయ్య శ్రీశైలం,సత్యనారాయణరెడ్డి ,యాదగిరి, సతీష్ మల్లయ్య, కోటేష్, రవి, గణేష్,అశోక్, తదుపరి బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



# ఇందిరమ్మ ఇండ్లను రైల్వే అండర్ పాస్ బ్రిడ్జిని పరిశీలించిన ఎంపీడీవో

**క్రైమ్ మిర్రర్ వలిగొండ:** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలోనిఏదు ళ్ళ గ ా డ ం % డ % ప్రా ద ్ద ట ా ం గ్రామాలమధ్యరాకపోకలకు,అంతరాయం కలగడంతో ఎంపీడీవో జి జలంధర్ రెడ్డి,ఆ మార్గాన్ని సందర్శించి అకాల వర్షం కారణంగా గ్రామాల మధ్య నున్న రైల్వే అండర్ పాస్ బ్రిడ్జ్ లోకి 9 అడుగుల నీరు వచ్చినందున రెండు గ్రామాల మధ్య రాకపోకలు నిలిచి పోయినవి,మంగళవారం ఎంపీడీవో సందర్శించి రైల్వే సిబ్బందితో సంప్రదించి నిల్వవున్న నీరు బైటకు మోటార్ సహాయంతో తోడించనైనది పైనుండి వరద నీరు వస్తున్నందున నీరు మొత్తం పోవుటకు కనీసం (2) రోజుల సమయంపట్టవచ్చునుఅని ఆయా గ్రామాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని అన్నారు.పంచాయతీ కార్యదర్శికి తగు సూచనలు సలహాలు ఇవ్వడంజరిగింది.ఆ తర్వాత నాగారం గ్రామాన్ని సందర్శించి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంను,సందర్శించి పరిశీలించి లబ్ధిదారులు త్వరగా నిర్మాణం పూర్తి చేసుకోవాలని లబ్ధిదారులకు సూచించారు.



# స్కూల్ బస్సును ఢీ కొట్టిన లారీలు

**క్యాబిన్ లో ఇరుక్కుపోయిన బస్సు డ్రైవర్**

**బస్సులో పిల్లలు లేకపోవడంతో తప్పిన ప్రాణాపాయం**

**శెట్టిపాలెం క్రాస్ రోడ్ నార్కెట్ పల్లి - అద్దంకి రోడ్డు వద్ద జరిగిన ఘటన**

**క్రైమ్ మిర్రర్ ప్రతినిధి, వేములపల్లి:** స్కూల్ బస్సు ను రెండు లారీలు ఇరువైపులా ఢీ కొట్టిన ఘటన వేములపల్లి మండల పరిధిలోని శెట్టిపాలెం క్రాస్ రోడ్డు వద్ద నార్కెట్ పల్లి – అద్దంకి రహదారి పై మంగళవారం చోటుచేసుకుంది. స్థానికులు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మిరియాల గూడా పట్టణంలోని ఆదిత్య పాఠశాలకు చెందిన స్కూల్ బస్సును డ్రైవర్ పెదమం గిరిబాబు రోజు మాదిరిగానే విద్యార్థులను తీసుకొచ్చేందుకు మండలంలోని శెట్టిపాలెం కు బయలుదేరాడు. ఈ క్రమంలో నార్కెట్ పల్లి–అద్దంకి రహదారిపై శెట్టిపాలెం క్రాస్ రోడ్డు వద్ద యూటర్న్ తీసుకుంటుండగా అవతలి వైపు వేములపల్లి నుంచి మిర్యాలగూడ వైపు లారీ వస్తుండడంతో గమనించి బస్సు ఆపుకున్నాడు. ఈ క్రమంలో బస్సు వెనుక వైపు నుంచి వస్తున్న కంటైనర్ ఒక్కసారిగా బస్సును వెనుక వైపు నుంచి ఢీకొట్టడంతో బస్సు ముందుకు వెళ్లగా వేములపల్లి నుంచి మిర్యాలగూడ వైపు వస్తున్న లారీ ముందు వైపు నుంచి బలంగా ఢీ కొట్టింది. ఈ సంఘటనలో బస్సు డ్రైవర్ గిరిబాబు క్యాబిన్ లో ఇరుక్కుని గాయాలు కాగా లారీ డ్రైవర్ ఆనంద్ నాందేవ్ మోలేకర్ కు గాయాలు అయ్యాయి దీంతో గమనించిన స్థానికులు బస్సు డ్రైవర్ గిరిబాబును క్యాబిన్ నుంచి బయటకు తీసి అనంతరం ఇద్దరినీ 108 వాహనంలో మిర్యాలగూడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు అనంతరం రహదారిపై రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా వేములపల్లి పోలీసులు బస్సు లారీలను క్రేన్ల సహాయంతో ప్రక్కకు తొలగించారు. బస్సును లారీ ఢీ కొట్టిన సమయంలో విద్యార్థులు ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని ఊపిరి పీల్చుకున్నారు. ఈ మేరకు స్కూల్ బస్సు డ్రైవర్ పెదమాం గిరిబాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై డి వెంకటేశ్వర్లు తెలిపారు.



# కల్మషం లేని గుణవంతుడు.. బొమ్మ శంకరుడు.



**సంస్థాన్ నారాయణపురం, అక్టోబర్ 14(క్రైమ్ మిర్రర్):** కళాకారుడు (ఆర్టిస్ట్) బొమ్మ శంకర్ చౌటుప్పల్ మండల పరిధిలోని దేవలమ్మనాగారం గ్రామమైనప్పటికీ గత 25 ఏండ్ల క్రితం వృత్తి పనిమీద సంస్థాన్ నారాయణపురం ప్రాంతంలో చాలా కాలం పాటు పని దొరకడంతో... ఇక్కడి ప్రజల ఆప్యాయత,ఆత్మీయత, స్థానిక యువతతో ఏర్పడిన స్నేహంతో తిరిగి వెళ్ళకుండా ఇక్కడే స్థిరపడేలా చేశాయి. వృత్తిరీత్యా బొమ్మ శంకర్ ఆర్టిస్ట్ ఎంతటి ఎత్తైన శిఖరం అంచున రాసే పనైనా ఒప్పుకుంటే పూర్తి చేసి తీరుతాడు. ఎలాంటి చిత్రాలైనా బొమ్మ శంకర్ చాలా సులభంగా వెయ్యగల నైపుణ్యం కలవాడు. తన కళని ఆసక్తి కలిగిన ప్రతి ఒక్కరికి పంచాలనే బలమైన కోరికతో తనతో పాటు పనిచేసే ప్రతి ఒక్కరిని పూర్తిస్థాయిలో ఆర్టిస్ట్ గా తీర్చిదిద్చిన గురువుగా సమాజంలో బొమ్మ శంకర్ కు పేరుంది.ఇప్పటికే తన శిక్షణలో పదిమందికి పైగా వివిధ ప్రాంతాలలో ఆర్టిస్టులుగా మారిన పరిస్థితి, వారు ఆర్టిస్ట్ గా తమ వృత్తిపైన జీవనం సాగిస్తూ కుటుంబాన్ని సాదుకుంటూ తమ కాళ్లపై నిలబడి వినూత్న పద్ధతిలో తమ ఆర్ట్ ని ప్రదర్శిస్తూ ఆత్మగౌరంతో జీవిస్తున్నారు. బొమ్మ శంకర్ స్వీకరించిన ఏ పనైనా శ్రమకు తగ్గ ఫలితమే తప్ప.. అతిగా ఆశించిన దాఖలాలు లేవు. అందులో కూడా కొంత తగ్గించి ఇవే ఉన్నాయన్న అని అంటే కూడా ఎదిరించి ఒక్క మాటైనా ప్రశ్నించని సౌమ్యుడు. బొమ్మ శంకర్ వరసగా కొన్ని రోజులు ఒక ప్రాంతంలో పనిచేస్తే ఆ ప్రాంతమంతా తనకు చుట్టాలే, అంతటి ప్రేమను రాగాలతో పలకరిస్తూ అందరిని వావి వరసలతో కలుపుకొని ఆప్యాయంగా మాట్లాడే మాట తీరు అందరిని మంత్రముగ్ధుల్ని చేస్తాయి. బొమ్మ శంకర్ అటువైపు నుండి వస్తుందంటే చిన్నపిల్లల నుండి పండు ముసలోల్ల వరకు అందరి కళ్ళలో ఆనందమే చిన్న పిల్లలను అలరించి, ఆడించి, ఆనందింపచేస్తాడు.. ముసలోళ్లకు చేతిలో కర్రవలె తనకు చేతనైన సాయం చేస్తాడు. బొమ్మ శంకర్ విద్యలో కూడా మెరుగైన విద్యార్థే సర్వేలు గురుకుల పాఠశాల పూర్వ విద్యార్థి ఇతను అప్పట్లో పదవ తరగతి ఫలితాల్లో ప్రథమ స్థాయి మార్కులు సాధించాడు. పాఠశాల దశలో నిర్వహించిన ప్రతి పరుగు పందెంలో తనే ముందుండేవాడు. ఉన్నత విద్యను కొనసాగించలేకపోయాడు. నిరుపేద కుటుంబం, వృద్ధాప్యంతో తల్లిదండ్రులు పడుతున్న బాధను చూడలేక కుటుంబ బాధ్యతను తను తీసుకోవాల్సిన పరిస్థితి అనివార్యమైంది. చెల్లె పెండ్లి, తమ్ముడి చదువు కోసం తను కళాకారుడుగా ( ఆర్టిస్ట్, పెయింటింగ్) వృత్తిలో అడుగుపెట్టి కుటుంబాన్ని చక్కబెట్టి సమాజంలో గౌరవంగా, ఆత్మగౌరవంగా జీవిస్తున్నాడు. తనతో స్నేహబంధం ఏర్పడితే ఆపదలో అరక్షణం కూడా ఆలోచించకుండా వాలిపోతాడు, సమస్యను తన చేతనైనంత వరకు తీర్చి పెడతాడు.ఆత్మీయులకు, స్నేహితులకు,బంధువులకు ఇప్పటి వరకు 20 సార్లు రక్తదానం చేసి ప్రాణదాతగా నిలిచాడు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన ప్రపంచ, భారతదేశ, రాష్ట్ర చిత్రపటాలు, మహనీయుల బొమ్మలు, సూక్తులను పాఠశాల గోడలపై ఎలాంటి లాభపక్ష లేకుండా ఉచితంగా రాస్తాడు,గీస్తాడు. కల్మషం లేని గుణవంతుడు,బొమ్మ శంకరుడు. ప్రస్తుతం తను పదిమందికి ఉపాధిని కల్పిస్తున్నాడు. వారి కుటుంబాలకు అండగా కష్ట,సుఖాల్లో తోడుంటాడు. తన కళని అందరికీ పంచుతూ నేటి సమాజంలో యువత కు ఆదర్శంగా నిలుస్తున్నాడు ఆర్టిస్ట్ బొమ్మ శంకర్. సంస్థలకు, పాఠశాలలకు, ప్రజలకు ఉపయోగపడే సామాజిక సేవా కార్యక్రమాల బ్యానర్లను తను ఎలాంటి ఫలితం ఆశించకుండా రాస్తుంటాడు. వివాదరహితుడు, క్రీడలను ప్రోత్సహిస్తాడు. ఆటల్లో ప్రతిభను కనబరిచే క్రీడాకారులకు బహుమతులను బహుకరించి ప్రోత్సహిస్తాడు. ఇక్కడి ప్రాంతంలో వినాయక చవితి సందర్భంగా భక్తులు ఆడే దాండియా, గర్భ డాన్స్ ను అప్పట్లో పరిచయం చేసింది కుడా బొమ్మ శంకరే... మన ప్రాంతానికి రావడానికి కారకులు సహచర కళాకారుడు ఆర్టిస్ట్ మందుగుల శ్రీనివాసన్న తో స్నేహమే ఇక్కడి ప్రాంతానికి ప్రజలకు, యువతలకు దగ్గర అయ్యేలా చేసిందని సందర్భం వచ్చిన ప్రతిసారి గుర్తు చేస్తుంటాడు,తన ఆత్మీయులతో.. ప్రస్తుతం జనతా గ్యారేజ్ అనే వాట్సాప్ గ్రూప్ ని ఏర్పాటు చేసి దాని ద్వారా స్నేహితుల, ఆత్మీయుల కష్టాల్లో తనతో పాటు గ్రూప్ సభ్యులను కూడా భాగస్వాములను చేస్తుండు. గ్రూపులో 10 మంది వరకు ఉంటారు. ప్రస్తుతం ఆపదలో ఆదుకుంటాం, కష్టాల్లో తోడుంటాం అని భావనతో బొమ్మ శంకర్ ఆధ్వర్యంలో ఇలాంటి మంచి సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తున్నందుకు ప్రజలందరూ అభినందిస్తున్నారు.

## స్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ ను కలిసిన పలువురు

మునుగోడు క్రైమ్ మిర్రర్: తెలంగాణ రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ను హైదరాబాద్ లో మునుగోడు మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు సురిగి నరసింహా గౌడ్ మరియు జర్నలిస్టు కోరే యాదగిరి,అడ్వకేట్ ఎర్రోళ్ల భూపాల్ లు మర్యాదపూర్వకంగా కలిశారు..



## జిల్లా బిసి అధికారి ఇందిరాకి వినతి పత్రం

**- నాయి బ్రాహ్మణ సేవా సంఘం జిల్లా కమిటీ**

**క్రైమ్ మిర్రర్, జయశంకర్ జిల్లా ప్రతినిధి:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా నాయి బ్రాహ్మణ సేవా సంఘం జిల్లా అధ్యక్షులు కురుమిళ్ళ శ్రీనివాస్ నాయి ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా వెనుకబడిన తరగతుల అధికారి ఈ. ఇందిరా జిల్లా కలెక్టరేట్లో కలిసి ఈనెల 19న జరిగే శ్రీ ధనవంతురి ఉత్సవాలను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా జరపాలని బీసీ అధికారి ఇందిరా గారికి నాయి బ్రాహ్మణ సంఘ నాయకులతో కలిసి వినతి పత్రం అందజేసిన జిల్లా అధ్యక్షులు కురుమిళ్ళ శ్రీనివాస్ నాయి. అనంతరం జిల్లాలోని ఫెడరేషన్ గ్రూపులకు గురించి బీసీ అధికారి ఇందిరా గారికి వివరించడం జరిగింది. ఇందిరా మేడం గారు స్పందించి జిల్లాలోని నాయి బ్రాహ్మణ ఫెడరేషన్ గ్రూపులకు ఎన్నికలు నిర్వహించాలని సంఘ నాయకులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు విజయగిరి నరేష్ నాయి, స్పోక్ పర్సన్ మురహరి సదానందం నాయి, గౌరవ సలహాదారులు జంపాల తిరుపతి నాయి, చెన్న సంపత్ నాయి, సహాయ కార్యదర్శి బిజిగిరి విజయ్ నాయి మరియు తదితర నాయి బ్రాహ్మణులు పాల్గొన్నారు.






## రైతు అవగాహన సదస్సు

**మొయినాబాద్ (క్రైం మిర్రర్ ) అక్టోబర్ 14:** మొయినాబాద్ మండల రైతు వేదికలో మండల వ్యవసాయ అధికారి అనురాధ రైతు అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది.ప్రస్తుతం యాసంగి పంటలపై, వాతావరణ ప్రభావం వలన రైతులు నష్టపోకుండ పాటించవలసిన మెలుకువలు తెలిపారు. ఈ సదస్సులో మండల వ్యవసాయ అధికారి అనురాధ తో పాటు కుమార్ , సునీల్ , మందడి రాఘవ రెడ్డి , బద్దం మహేందర్ రెడ్డి ,బొక్క వెంకట్ రెడ్డి ,ఇతరులు రైతులు, పాల్గొనడం జరిగింది.

## ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి కుటుంబాన్ని పరామర్శించిన కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి



**సంస్థాన్ నారాయణపురం అక్టోబర్ 14.(క్రైమ్ మిర్రర్) :** నర్సంపేట నియోజకవర్గ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి మాతృమూర్తి దొంతి కాంతమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలిసిందే. మంగళవారం మునుగోడు నియోజకవర్గ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి హనుమకొండ పట్టణంలోని దొంతి మాధవరెడ్డి నివాసానికి వెళ్లి దొంతికాంతమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వీరితోపాటు సంస్థాన్ నారాయణపూర్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉప్పల లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

## బాణాసంచా దుకాణాలు పెట్టేవారు ముందుగా పోలీస్ వెబ్సైట్లో ఆన్లైన్ ద్వారా దరఖాస్తు పెట్టుకోవాలి.

**క్రైమ్ మిర్రర్ శంకర్ పల్లి :** పట్టణములో, మండలంలోని గ్రామాలలో, మున్సిపాలిటీ పరిధిలో బాణాసంచా దుకాణాలు దీపావళి సందర్భంగా పెట్టుకునేవారు తప్పనిసరిగా పోలీస్ వెబ్సైట్లో ఆన్లైన్ ద్వారా దరఖాస్తు పెట్టుకోవాలని శంకర్ పల్లి సిఐ శ్రీనివాస్ గౌడ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనుమతి లేని బాణాసంచా దుకాణాలు ఉంటే వాటిని తొలగించడం జరుగుతుందని హెచ్చరించారు. బాణాసంచా దుకాణాలు పెట్టుకునే వారు తగు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. నీరు, ఇసుక తదితర సామాగ్రి తమ దుకాణాల పక్కన పెట్టుకోవాలని సూచించారు. https://cybpms.telangana.gov.in ఈ వెబ్సైట్లో దరఖాస్తు చేయించుకోవాలని ప్రకటనలో తెలిపారు.



# కులవివక్షతలో భాగంగానే ప్రధాన న్యాయమూర్తి పై దాడి

**బాలాపూర్ (క్రైమ్ మిర్రర్) :** సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి పై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని రిటైర్డ్ శాస్త్రవేత్త రాజేశ్వరరావు అన్నారు. మీర్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని జిల్లెల్లగూడలో ఉన్న సమతా భవన్ లో సీజేపై జరిగిన దాడికి నిరసనగా రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి న్యాయవాదులు, డిప్యూటీ కలెక్టర్స్, ప్రొఫెసర్లు, అధ్యాపకులు, ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థులు, జర్నలిస్టులు హాజరై దాడిని ఖండించారు. ప్రజాస్వామ్య దేశంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి పై జరిగిన దాడిని భారత రాజ్యాంగంపై జరిగినట్టుగానే భావించవలసి వస్తుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు సీజేకే రక్షణ లేకపోతే ఇక సాధారణ ప్రజల పరిస్థితి ఏమిటని వారు ప్రశ్నించారు. ఈ దాడి వెనకాల మతోన్మాదుల కుట్ర ఉందన్నారు. కులం పేరుతో మతం పేరుతో దళిత బహుజనులను వివక్షతకు గురి చేస్తున్నారని వారు ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో నిత్యం ఏదో ఒకచోట బలహీన వర్గాలపై దాడులు జరుగుతూనే ఉన్నాయని వక్తలు అభిప్రాయపడ్డారు. ఈ దాడులను ఎదుర్కోవడానికి దళిత బహుజన సంఘాలన్నీ, వామపక్ష ఉద్యమ శక్తులు ఐక్య సంఘటనలు కట్టవలసిన అవసరం ఉందన్నారు.



సీజేపై జరిగిన దాడి ప్రజాస్వామ్యం మీద జరిగినట్టుగానే పరిగణించాలన్నారు. ఈ దాడిని నిరసిస్తూ రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహించవలసిన అవసరముందన్నారు. ప్రతి ఒక్కరూ ఈ సంఘటనపై స్పందించాలన్నారు. దేశంలో దళితులపై ఇంకా వివక్షత కొనసాగుతూనే ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. దేశానికి స్వాతంత్రం వచ్చిన దళిత జాతికి మాత్రం అంటరానితనం పోలేదన్నారు. అంటరానితనం పైన పోరాడవలసిన అవసరం ఉందని తెలిపారు.

# సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బిఆర్ గవాయి పై దాడి హేయమైన చర్య

- సంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు నల్ల జెండాలతో నిరసన
- ఢిల్లీ పోలీసు యంత్రాంగం వెంటనే అరెస్ట్ చేసి కఠిన చర్యలు తీసుకోవాలి
- కలెక్టర్ కి వినతి పత్రం సమర్పించిన ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు మైసగళ్ళ బుచ్చేంద్ర మాదిగ



**సంగారెడ్డి, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి అక్టోబర్ 13:** సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్. గవాయిపై దాడిని ఖండిస్తూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో సంగారెడ్డిలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి వి.ఎస్. రాజు మాదిగ, ఎమ్మార్పీఎస్ సంగారెడ్డి జిల్లా ఇన్చార్జి. పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు, భారత సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్. గవాయిపై జరిగిన దాడిని నిరసిస్తూ సంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు నల్లజెండాలతో భారీ నిరసన ధర్నా నిర్వహించారు. నిరసనకారులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఈ క్రింది డిమాండ్లను సమర్పించారు 1. దాడికి పాల్పడిన వ్యక్తిపై తక్షణమే కేసు నమోదు చేసి అరెస్టు చేయాలి. 2. దాడికి వెనుక ఉన్న శక్తులను గుర్తించి, వారికి శిక్షలు పడేలా సమగ్రమైన దర్యాప్తు జరిపించాలి. 3. దర్యాప్తు కోసం సుప్రీం కోర్టులో అనుభవం కలిగిన, ప్రజాస్వామిక దృక్పథం కలిగిన రిటైర్డు జడ్జీలను నియమించాలి. 4. ఇలాంటి ఘటనలు ఉన్నత న్యాయవ్యవస్థల్లో పునరావృతం కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకోవాలి. ఈ డిమాండ్లను తక్షణమే పరిగణనలోకి తీసుకొని తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టరేట్ ముందు పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం అనంతరం కలెక్టర్ కి వినతి పత్రం సమర్పించడం జరిగింది. ఈ నిరసన కార్యక్రమంలో పలువురు ఎమ్మార్పీఎస్ మరియు ఎంఎస్పీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఎంఎస్పీ జిల్లా సీనియర్ నాయకులు ఘాటోళ్ల వెంకటేష్, నల్లోల్ల ప్రవీణ్ కుమార్ మాదిగ ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి, రవి మాదిగబిఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు, వెలిమల ప్రమోద్ మాదిగ ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి, క్యాసారం నటరాజ్ మాదిగ ఎంఎస్పీ జిల్లా అధికార ప్రతినిధి, దండు జయరాజ్ మాదిగ ఎంఎస్పీ జిల్లా ఉపాధ్యక్షులు, బండ రాజు మాదిగ ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి, మాస్కురి సాయిలు మాదిగ ఎమ్మార్పీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి, కోలుకుందు మోహన్ మాదిగ ఎమ్మార్పీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి, కొంగేరి కృష్ణ మాదిగ ఎంఎస్పీ నాయకులు, జంగం విజయ్ ప్రసాద్ మాదిగ ఎమ్మార్పీఎస్ మునిపల్లి మండల కన్వీనర్, కందుకూరు యేసయ్య మాదిగ, బందెల రవికుమార్ మాదిగ, రాజేందర్ మాదిగ, దుర్గాదాస్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

# వట్టినాగులపల్లి నుంచి శబరిమలైకు పాదయాత్రగా బయలుదేరిన స్వాములు

**గండిపేట(క్రైం మిర్రర్):** గండిపేట మండలం నార్సింగి మున్సిపాలిటీ వట్టినాగులపల్లి నుంచి మంగళవారం అయ్యప్ప స్వాములు శబరిమలైకు ర్యాలీగా బయలుదేరారు. స్వాములంతా కలిసి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి శబరిమలై పాదయాత్రగా తరలివెళ్లారు. వట్టినాగులపల్లి గ్రామ ప్రజలు, నాయకులు, యువకులు స్వాములను ఘనంగా పూలమాలలు వేసి శాలువాలతో సన్మానించి సాగనంపారు. పాదయాత్రగా తరలివెళ్లిన వారిలో మొద్దు సాయిరాం స్వామి, బుడాల శ్రీకాంత్స్వామి, సోమయాల ఆర్యాస్వామి, మొద్దు రాకేష్ స్వామి, యాలాల కమలాకర్ స్వామి, చిట్టబోయిన వినయ్స్వామి తదితరులున్నారు.





## మహిళ మెడ లోంచి బంగారు గొలుసు ఎత్తుకూని వెళ్లిన దొంగ ను పట్టుకున్న స్థానికులు

**క్రైమ్ మిర్రర్ శంకర్ పల్లి :** ఇంట్లో ఒంటరిగా ఉన్న మహిళపై బ్యాట్ తో దాడి చేసి కారంపొడి జల్లి మెడలో పుస్తెలతాడు లాక్కొని వెళ్లిన ఘటన శంకర్పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది . పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కుంబారి సిద్ధారెడ్డి అనే వ్యక్తి హొటల్ నిర్వాహకుడు.. అతను హొటల్ సమీపంలో నే ఇంట్లో అద్దెకు ఉంటున్నాడు. ఉదయం హొటల్లో పని ముగించుకున్న అనంతరం భార్య వారి పిల్లల కోసం వంట చేసేందుకు ఇంటికి వెళ్లింది. ఎంత కు భార్య లంచ్ బాక్స్ తో రాక పొవడంతో మధ్యాహ్నం సమయంలో భార్యకు ఫోన్ చేశాడు.. భార్య ముందు ఫోన్ లిఫ్ట్ చేయలేదు. కొద్ది సేపటి తరువాత భార్య ఫోన్ చేసి ఓ గుర్తు తెలియని వ్యక్తి దాడి చేసి పుస్తెలతాడు తెంచుకెళ్లినట్లు తెలిపింది. విషయం తెలిసిన సిద్ధారెడ్డి వెంటనే ఇంటికి వెళ్లి చూడగా భార్య తల కు గాయమై రక్తం కారుతుంది . భార్య చెప్పిన విషయాన్ని తెలుసుకున్న సిద్దారెడ్డి దుండగుడు పారిపోయిన దారిలో వెళ్ళగా సమీపంలోని వాటర్ వాష్ దగ్గర ఓ వ్యక్తిని ప్రవీణ్ అతని పనివారు పట్టుకున్నారు. అతని దగ్గర బ్యాగులో మంకీ క్యాప్, కారంపొడి ప్యాకెట్ ఇతర వస్తువులు దొరకడంతో దయచేసి దొంగతనానికి పాల్పడింది అతనే అని నిర్ధారించుకున్నారు. అతని పోలీస్ స్టేషన్లో అప్పగించారు. గాయపడిన సిద్ధారెడ్డి భార్యను స్థానికులు ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్నారు. అతను సిద్ధారెడ్డి హొటల్ ఎదురుగా అద్దెకు ఉండే వాసుగా గుర్తించినట్లు తెలిసింది. పోలీసులు నిందితు నుంచి మూడున్నర తులాల బంగారు పుస్తెల తాడును స్వాధీనం చేసుకున్నారు. వెంటనే స్పందించి దొంగను పట్టుకున్న స్థానికులను శంకర్ పల్లి సి ఐ శ్రీనివాస్ గౌడ్ అభినందించారు.

## లైంగిక హింస, దాడుల, సైబర్ మోసాలపై అవగాహన

**గండిపేట(క్రైం మిర్రర్):** మణికొండలో సోషల్ యాక్షన్ మోబిలిస్, ఆమెజాన్ల ఆధ్వర్యంలో ఫోక్సో( ప్రొటెక్షన్ ఆఫ్ చిల్డ్రన్ ఫ్రమ్ సెక్స్యూయల్ ఆఫెన్స్), సైబర్ సెక్యూరిటీపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మాజీ కౌన్సిలర్ రామకృష్ణారెడ్డి, శ్రీనివాస్, యష్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థుల పట్ల జరిగే లైంగిక హింస, లైంగిక దాడుల గురించి, సైబర్ మోసాల గురించి ప్రతి ఒక్కరు తెలుసుకోవాలన్నారు. ఇటువంటి పరిస్థితులు ఎదురైనప్పుడు వారు ఎవరిని సంప్రదించాలి ఎలాంటి సహాయాన్ని అర్థించాలి అనే దానిపై 4,5వ తరగతి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.



# రాజేంద్రనగర్‌లోని వ్యవసాయ విశ్వవిద్యాలయంలో వెస్టర్న్ సిడ్నీ యూనివర్సిటీ ప్రతినిధులతో కీలక సమావేశం

**గండిపేట(క్రైం మిర్రర్):** ఆస్ట్రేలియాకు చెందిన ప్రపంచ ప్రఖ్యాత విశ్వవిద్యాలయం వెస్ట్రన్ సిడ్నీ యూనివర్సిటీ ప్రొఫెసర్ ఆయాన్ అండర్సన్ నేతృత్వంలో ఉన్నత స్థాయి ప్రతినిధుల బృందం, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య, ఇతర అధికారులతో మంగళావారం కీలక సమావేశం నిర్వహించింది. గత ఆరు మాసాలుగా వివిధ స్థాయిల్లో జరిగిన చర్చల అనంతరం వ్యవసాయ విద్య, మరియు పరిశోధన రంగాలలో ఈ రెండు విశ్వవిద్యాలయాలు కొన్ని కీలక భాగస్వామ్య రంగాలపై చర్చించి ఇటీవలనే అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. ఈ అవగాహన ఒప్పందాల ప్రకారం వ్యవసాయ విద్య, పరిశోధన రంగాలలో వివిధ కార్యక్రమాలను సంయుక్తంగా చేపట్టేందుకు నేటి సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఇందులో మొదటిది ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, వెస్ట్రన్ సిడ్నీ యూనివర్సిటీ సంయుక్తంగా బీఎస్సీ అగ్రికల్చర్ కోర్సును ఈ విద్యా సంవత్సరం నుంచే ప్రారంభిస్తున్నారు. ఇందులో భాగంగా మూడు సంవత్సరాలు పీజేటీఏయూ రాజేంద్రనగర్ లోనూ, నాలుగో సంవత్సరం సిడ్నీ లోని వెస్ట్రన్ సిడ్నీ యూనివర్సిటీలో చదువుకునే విధంగా డ్యూయల్ డిగ్రీ ప్రోగ్రాం పై ఒప్పందం కుదిరింది. ఈ విధంగా నాలుగు సంవత్సరాలు పూర్తి చేసిన తర్వాత విద్యార్థులు పీజేటీఏయూ నుంచి బీఎస్సీ అగ్రికల్చర్ డిగ్రీని, వెస్ట్రన్ సిడ్నీ యూనివర్సిటీ నుంచి బీఎస్సీ వ్యవసాయ ఆహార శాస్త్రంలో డిగ్రీని పొందుతారు. విద్యార్థులు తదుపరి పీజీ, పీహెచ్డీ కోర్సులను వెస్ట్రన్ సిడ్నీ యూనివర్సిటీలో నేరుగా చేసుకొనే విధంగా ఒప్పందం కుదిరింది. ఈ విధంగా తెలంగాణ నుండి ప్రతి సంవత్సరం 25 నుంచి 30 మంది విద్యార్థులకు ఆస్ట్రేలియాలో నేరుగా చదువుకునే అవకాశం కలుగుతుంది. అదేవిధంగా వ్యవసాయ రంగంలో వేగంగా వస్తున్న కృత్రిమ మేధా ఆధారిత సాంకేతిక పరిజ్ఞానాన్ని తెలంగాణ రైతాంగానికి అందే విధంగా వెస్ట్రన్ సిడ్నీ యూనివర్సిటీతో పి జె టి ఏ యు మరో కీలక ఒప్పందాన్ని కుదుర్చుకుంది. ఈ సందర్భంగా వెస్ట్రన్ సిడ్నీ యూనివర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ అయాన్ అండర్సన్ మాట్లాడుతూ.. భారత వ్యవసాయ పరిశోధనా మండలి ఇప్పటికే డబ్ల్యూ.ఎస్. యుతో ఒక



అవగాహన ఒప్పందం కుదుర్చుకుందని, దాని ప్రకారం భారతదేశంలోని వివిధ వ్యవసాయ విశ్వవిద్యాలయాలతో సంయుక్తంగా విద్య, పరిశోధనా రంగాలలో కార్యక్రమాలు చేపట్టే అవకాశం ఉందని తెలిపారు. ఇందులో భాగంగా పిజేటీఏయు తో గత కొన్ని నెలలుగా చర్చల అనంతరం ఈ డ్యూయల్ డిగ్రీ ప్రోగ్రాం ఈ సంవత్సరం నుండి ప్రారంభిస్తున్నామని, అంతేకాకుండా, సాంకేతిక పరిజ్ఞానాన్ని వ్యవసాయ రంగంలో ప్రవేశపెట్టే విధంగా అగ్రి రోబోటిక్స్ మరియు కృత్రిమ మేధస్సు ఆధారిత సాంకేతిక పరిజ్ఞానాలపై ఒప్పందం కుదరటం సంతోషంగా ఉందన్నారు. గత ఏడాది కాలం నుండి 4 అంతర్జాతీయ, 5 జాతీయ సంస్థలతో వ్యవసాయ విద్య, పరిశోధన రంగాలలో పరస్పర సహకారం కోసం అవగాహన ఒప్పందాలు కుదుర్చుకొని వివిధ కార్యక్రమాలు ప్రారంభిస్తున్నామని అందులో భాగంగానే ఈ విద్యా సంవత్సరంలో 25 మంది విద్యార్థులకు పీ జే టి ఏ యు - వెస్ట్రన్ సిడ్నీ యూనివర్సిటీ డ్యూయల్ డిగ్రీ ప్రోగ్రాం కింద ప్రవేశాలు కల్పించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో డబ్ల్యూ.ఎస్.యు ప్రొఫెసర్ మార్క్, డాక్టర్ నిషా రాకేష్, డాక్టర్ కోపల్ చౌబే తో పాటు, ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం నుంచి డీన్స్ డాక్టర్ ఝాన్సీ, డాక్టర్ ఈశ్వరి, డాక్టర్ రమణారావు, డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి, అంతర్జాతీయ ప్రోగ్రామ్స్ డైరెక్టర్ డా. రాములు మరియు రిజిస్ట్రార్ డాక్టర్.జీ. ఈ. సిహెచ్. విద్యాసాగర్ తో పాటు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడడం అధికారుల బాధ్యత

**మణికొండ మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్ కె.రామకృష్ణారెడ్డి**

**గండిపేట(క్రైం మిర్రర్):** ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని మణికొండ మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్ కె.రామకృష్ణారెడ్డి సూచించారు. మున్సిపాలిటీ పరిధిలోని మణికొండ క్వార్టర్స్ వద్ద నిర్మితమవుతున్న ఇందిరమ్మ ఇల్లు నిర్మాణ భవనాన్ని ఆయన పరిశీలీఇంచారు. స్థానికుడి ఇంటికి కరెంటు తీగలు అడ్డు రావడంతో ఇంటి నిర్మాణం ఆలస్యం అవుతుండడం వల్ల బాధితుడు విజ్ఞప్తి మేరకు ఇంటిని పరిశీలించారు. అలాగే ట్రాన్స్‌కో అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని సూచించారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చూస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శ్రావణ్‌కుమార్, గంగాధర్ తదితరులున్నారు.





# హనుమాన్ దీక్ష వాల్ పోస్టర్స్ విడుదల

**క్రైమ్ మిర్రర్, నాంపల్లి :** మండల కేంద్రంలోని సీతా రామ లక్ష్మణ హనుమత్ సమేత శ్రీ రామచంద్ర స్వామి దేవస్థానంలో హనుమాన్ శక్తి జాగరణ సమితి జాతీయ అధ్యక్షులు మద్ది మడుగు పీఠాధిపతి కేతావత్ జయరాం గురుస్వామి ఆదేశాల మేరకు హనుమాన్ దీక్ష మద్దిమడుగు వాల్ పోస్టర్స్ హనుమాన్ శక్తి జాగరణ సమితి యువజన విభాగం నల్లగొండ జిల్లా ప్రధాన కార్యదర్శి పానగంటి మహేష్ గౌడ్ గురుస్వామి ఆధ్వర్యంలో ఆవిష్కరణ చేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తేదీ: 23-10-2025గురువారం నుండి 26-10-2025ఆదివారం వరకు హనుమాన్ దీక్ష పీఠాధిపతి కేతావత్ జయరాం గురుస్వామి వారి కరకమలముల మీదగా మాలధారణ జరుగును. మండలంలోని అన్ని గ్రామాలలో అధిక సంఖ్యలో హనుమాన్ దీక్ష సేకరించి హిందూ ధర్మాన్ని హిందువుల ఐక్యతను చాటి చూపాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కోట రఘునందన్, ప్రధాన కార్యదర్శి అల్లం పల్లి ఆనంద్, అయ్యప్ప గురుస్వామి గోలి కృష్ణ ,హనుమాన్ శక్తి జాగరణ సమితి అధ్యక్షులు కర్నాటి గోవర్ధన్, పట్టణ మాజీ ఉప సర్పంచ్ సంగెం గణేష్, పోలోజు వెంకట చారి, బచ్చన బోయిన శంకర్, గుర్రం శ్రీరాములు, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.




# బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో శుభ్రత పాటించని హెూటల్స్‌కు రూ.28 వేల జరిమానా

**గండిపేట(క్రైం మిర్రర్):** బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అపరిశుభ్రంగా ఉన్న హెూటల్స్‌లో తనిఖీలు నిర్వహిస్తున్నామని కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర అన్నారు. కార్పొరేషన్ పరిధిలో శుభ్రత ప్రమాణాలు పాటించకుండా, అపరిశుభ్రంగా ఉన్న పలు హెూటల్స్‌లో మున్సిపల్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. రియల్ తందూరి చాయ్ అండ్ రెస్టారెంట్, ఎస్ఎస్ బావర్చి, చౌదరి హార్డ్వేర్ అండ్ పెయింట్స్, సెలబ్రేషన్ స్వీట్స్, ఉడిపి శ్రీకృష్ణ గ్రాండ్, శ్రీ రాఘవేంద్ర భవన్‌లలో తనిఖీలు చేసి రూ.28 వేల జరిమానా విధించారు. మళ్లీ శుభ్రత ప్రమాణాల విషయంలో నిర్లక్ష్యం వహిస్తే హెూటల్స్‌ను సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో అధికారులు, వెంకట్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

# నార్సింగిలో రేషన్ షాపు కేటాయింపులో స్థానికులకే ప్రాధాన్యత ఇవ్వాలి

నార్సింగి మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్ ఉషారాణి

గండిపేట(క్రైం మిర్రర్): నార్సింగి మున్సిపాలిటీలో నార్సింగి గ్రామంలో రేషన్ షాప్ నెంబర్ 3,4 స్థానికులకే కేటాయించాలని నార్సింగి మాజీ కౌన్సిలర్ ఉషారాణి, లక్ష్మి, సంతోషిలు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆర్డీవో కార్యాలయంలో ఏవో గిరిజను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ కౌన్సిలర్ ఉషారాణి మాట్లాడుతూ ఈ షాపులను స్థానికులకే కేటాయించాలన్నారు. ప్రస్తుతం రేషన్ షాపులు నడుపుతున్న రాజునాయక్, శ్రావణ్‌నాయక్‌లు తప్పుడు చిరునామా, ఆధారాలు చూపించి నార్సింగిలో నివాసం ఉంటున్నట్లుగా నటిస్తున్నారన్నారు. శ్రావణ్‌నాయక్ కరీంనగర్ జిల్లా అని, రాజునాయక్‌ది మహబూబ్‌నగర్ జిల్లా అని వీరు స్థానికులు కాదని వారు స్పష్టం చేశారు. నార్సింగి గ్రామంలో ఎస్సీ వర్గానికి చెందిన నిరుపేదలు అధిక సంఖ్యలో ఉన్నారని వీరు పూలు, కూరగాయలు అమ్ముకొని జీవనం సాగిస్తున్నారన్నారు. వీరి దయనీయ పరిస్థితిని దృష్టిలో ఉంచుకోని నిరుపేద స్థానికులకే ఈ రేషన్ షాపులను కేటాయించాలని వారు కోరారు. ఇదే విషయాన్ని ఆర్డీవో కార్యాలయంలో ఏవో గిరిజను లకిసి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశామన్నారు. తప్పుడు పత్రాలతో షాపులు నడుపుతున్న వారిపై చర్యలు తీసుకోని స్థానిక నిరుపేదలకు న్యాయం చేయాలని కోరామన్నారు. దీనిని వారు సానుకూలంగా స్పందించారని తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారన్నారు.

